క్లుప్తంగా

శివాలయానికి విరాళాలు



దాతలను అభినందిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు

ఒంగోలు మెట్రో: నగరంలోని రంగారాయుడు చెరువు దగ్గర పునర్ నిర్మాణంలో ఉన్న భువనేశ్వరి సమేత పశుపతిశ్వర స్వామి దేవస్థానానికి దాతలు విరాళం అందించారు. లాయర్ పేటలో నివాసం ఉంటున్న బొమ్మరాజు సీతారామయ్య ఆధ్వర్యంలో పాపిరాజు వెంకటరమణ, రాంబాబు వారి తండ్రి పాపిరాజు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.1 లక్ష శివాలయానికి ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యుడు మైనంపాటి సాయికుమార్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ దాతలకు సమితి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పునర్‌నిర్మాణంలో ఉన్న శివాలయానికి భక్తులు అందరూ సహకారం అందించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ పరమాత్ముని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు నిధులు కేటాయించాలి

ఒంగోలు టౌన్: రానున్న వేసవి దృష్టిలో వుంచుకొని నగర కార్పొరేషన్ బడ్జెట్‌లో మంచినీటి సరఫరా కోసం రూ.5 కోట్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం తాగునీటి సరఫరాకు కేటాయించిన రూ.2 కోట్లు ఏ మూలకు కూడా సరిపోవన్నారు. నగర శివారులోని 16 కాలనీలకు 165 ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. ప్రతి ఏటా మంచినీటి కోసం రూ.5 కోట్లు కేటాయించడంకంటే ఆయా ప్రాంతాలకు శాశ్వత ప్రతిపాదికన పైపులైన్ ఏర్పాటు చేయడం మంచిదని సూచించారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి కార్పొరేషన్ పరిధిలో రోజూ ఉత్పత్తి అవుతున్న 135 టన్నుల చెత్తను పూర్తిగా తొలగించడంలేదని, అయినప్పటికీ దానికోసం బడ్జెట్‌లో రూ.4 కోట్లు కేటాయించడంపై సందేహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ శంకర విగ్రహ ప్రతిష్ఠ



నందీశ్వరస్వామి ప్రతిష్ఠలో భక్తులు

ఒంగోలు మెట్రో: ఓం నమఃశివాయ శివ పంచాక్షరి నామంతో భక్తులు పులకించిపోయారు. మంగళవారం నగరంలోని వజ్రగిరి లక్ష్మీ నరసింహస్వామి పీఠం ఆధ్వర్యంలో ఒంగోలు అద్దంకి బస్టాండ్ దగ్గర గౌరీ శంకర ఉమామహేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గిరి శర్మ, సతీష్ శర్మ వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, కంకణ దారుణం, గణపతి హోమం, మహా సుదర్శన హోమం, విగ్రహాలకు అభిషేకం, మూలమంత్ర జపాలు, అతివాస హోమం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

ప్రమీల మృతికి సంతాపం



ప్రమీల భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న రవిబాబు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని 13వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాసపల్లి సూర్యరాజేష్ తల్లి ప్రమీల మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతురాలు ప్రమీల భౌతిక కాయాన్ని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావులు సందర్శించి నివాళులర్పించారు. మృతురాలు ప్రమీల కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కో–ఆప్షన్ మెంబర్ స్వర్ణ శ్యామ్ సాగర్, నాయకులు, తదితరులు ఉన్నారు.

బోర్డ్ ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర

కొండపి: కొండపి పొగాకు బోర్డు పరిధిలోని రైతులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి పొగాకు బోర్డ్ వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన యాత్ర నిర్వహించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా కరేడు జీపీఐ టొబాకో త్రెస్సింగ్ ప్లాంట్ను సందర్శించారు. రైతులు క్షేత్రస్థాయి సిబ్బంది రైతుల దగ్గర కొనుగోలు చేసిన పొగాకును ఎటువంటి పద్ధతి ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులకు విక్రయిస్తారో , పొగాకు ప్యాకింగ్‌లో పాటించాల్సిన అంతర్జాతీయ ప్రమాణాలను తెలుసుకున్నారు. జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు, సీనియర్ మేనేజర్లు హెచ్‌వీ పునీత్, మదన్ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనాలు.. అధికారుల గుబులు

గెలాక్సీ హబ్‌గా పేరొందిన చీమకుర్తిలో ప్రభుత్వ కార్యాలయాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కోట్లకు కోట్లు ఆదాయం వచ్చే చీమకుర్తికి కొత్త భవనాలు నిర్మించేందుకు దిక్కులేదా ? అన్న ప్రశ్నలు తలెత్తకమానడం లేదు. పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, పనిచేస్తున్న సిబ్బంది తల పైకెత్తి పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ! ఎప్పుడు ? ఎక్కడ ? ఏది కూలుతుందోనని సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం అంటున్న కూటమి నాయకులు ప్రగల్భాలు కాస్త పక్కన పెట్టి ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..



చీమకుర్తి మండల రెవెన్యూ భవనంలో విరిగిన తలుపు...

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
- కూలిపోయే దశలో తహసీల్దార్ కార్యాలయం
- జలవనరుల శాఖ కార్యాలయంలో కారుతున్న నీరు
- భయాందోళనలో సిబ్బంది, ప్రజలు

చీమకుర్తి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అధికారులు వాటిల్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మండల రెవెన్యూ కార్యాలయ భవనంతో పాటు జల వనరులశాఖ కార్యాలయం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, మండల విద్యా వనరుల కేంద్రం ఇలా అన్ని భవనాలు శిథిలావస్థకు చేరి కూలిపోయే దశలో ఉన్నాయి. పెచ్చులూడిన శ్లాబులు, సగం ఊడిన కిటికీలు, పగిలిన తలుపులు అధ్వానంగా, పగిలిన గచ్చులతో ఆయా కార్యాలయాలు ఉన్నాయి. ఏ చిన్నపాటి వర్షం కురిసినా పెచ్చులూడిన శ్లాబుల ద్వారా వర్షపు నీరు కారుతోందని అందులో ఉండేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయం చూసినా ఎప్పుడు కూలిపోతుందనే అనుమానం వస్తోందని, ప్రమాదం జరగకముందే కొత్త భవనాలు నిర్మించాలని ఉద్యోగులు, విద్యార్థులు, కార్యాలయాలకు పని చేయించుకోవడానికి వచ్చిన ప్రజలు అధికారులను కోరుతున్నారు.

తల పైకెత్తి పనిచేస్తున్న సిబ్బంది..



చీమకుర్తి మండల రెవెన్యూ భవనం స్లాబుల నుంచి కారుతున్న వర్షపునీరుతో తడిసి ముద్దవుతున్న గదులు (ఫైల్)

ముఖ్యంగా మండల రెవెన్యూ కార్యాలయంలో వర్షం కురిసే సమయంలో తుపాను రోజుల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుల శబ్దాలు, భారీ ఈదురు గాలులు, వర్షం కురుస్తున్న సమయంలో స్లాబుల నుంచి నీరు కిందికి కారుతూ కంప్యూటర్ల మీద, ఫైల్స్ మీద, టేబుళ్ల మీద పడటంతో అవి నాశనం అవుతున్నాయి. పెచ్చులూడుతూ ఎప్పుడు మీద పడతాయేమోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనాలు ఇంతా దారుణంగా ఉన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు శూన్యమన్న వాదనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



ఎన్‌ఎస్పీ ప్రభుత్వ కార్యాలయ భవనంలో వర్షాకాలంలో భద్రతలేని రికార్డులు (ఫైల్)

43 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు..

1982 ప్రాంతంలో ఆనాటి సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు వేమా ఎల్లయ్య కృషితో ఆనాటి రెవెన్యూ శాఖ మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెవెన్యూ కార్యాలయ శంకుస్థాపన చేశారు. కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డిని తీసుకువచ్చారు. రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు విషయంలో వేమా ఎల్లయ్య సుంకర మస్తాన్‌రెడ్డి నుంచి భూ సేకరణ చేయించి భవనం ఏర్పాట్లలో ఆయన పాత్ర కీలకమైంది. దీంతో ఆయన సేవలు గుర్తించిన ప్రభుత్వం రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో రెండున్నర సెంట్ల స్థలంలో వేమా ఎల్లయ్య విగ్రహం ఏర్పాటు చేశారు.



కూలేస్థితికి చేరిన చీమకుర్తి మండల రెవెన్యూ భవనం



శిథిలావస్థలో చీమకుర్తి మండల విద్యా వనరుల కేంద్రం



చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో పెచ్చులూడిన శ్లాబు

ప్రత్యామ్నాయ భవనం లేక పనులు జాప్యం..

చీమకుర్తి మండల రెవెన్యూ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి డీఎంఎఫ్ నిధుల నుంచి కలెక్టర్ రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం డిజైనింగ్, పొజిషన్‌లో ఉంది. మాకు ప్రత్యామ్నాయ భవనం కోసం పాత మున్సిపల్ ఆఫీసును ఎంపిక చేయగా అందులో రెండు సచివాలయాలు ఉన్నాయి. వాటిని ఖాళీ చేయించి రెవెన్యూ అధికారులకు అప్పగించేందుకు మున్సిపల్ కమిషనర్ సంబంధిత ఆధికారులకు అనుమతి కోసం లేఖ రాశాం. అనుమతులు రాగానే ఆ భవనం మాకు అప్పగిస్తారు.

– ఆర్ బ్రహ్మయ్య, మండల తహసీల్దార్, చీమకుర్తి

విశిష్ట సంఖ్యతో రైతులకు ఉపయోగాలు



రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో పావని

సంతనూతలపాడు: రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రైతు విశిష్ట నంబర్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి పీ.పావని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పేర్నమిట్ట, ఎండ్లూరు రైతు సేవా కేంద్రాల్లో ఏవో రైతు విశిష్ట గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తమ ఆధార్, పొలం పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబర్ తీసుకుని రైతు సేవాకేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీపై విత్తనాలు, క్రాప్ ఇన్సూరెన్స్, పంట రుణాలు మొదలైనవి అందుతాయని తెలియజేశారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం ఫిబ్రవరి 26 ఆఖరి తేదీ అని వీలైనంత త్వరగా నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కే. వెంకటసుబ్బారెడ్డి, ఎస్. వెంకట్రావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే చిన్నారులకు బంగారు బాట



మద్దిపాడులో అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆర్జేడీ జయలక్ష్మి



మాట్లాడుతున్న సీడీపీవో ఫణిరాజ కుమారి

మద్దిపాడు: చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు అంగన్‌వాడీలు బాటలు వేయాలని ఆర్జేడీ జయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్జేడీ జయలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన అందించాలన్నారు. కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రతి చిన్నారిని ఎత్తు, బరువులను చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఇవాంజెలిన్, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన

కొత్తపట్నం: అంగన్‌వాడీ స్కూల్ వచ్చే పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అందించాలని సీడీపీవో ఫణిరాజ కుమారి అన్నారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్లకు మంగళవారం జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆరు రోజులు పాటు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పిల్లలకు ఆటలు, పాటలు, చిత్రాల ద్వారా బోధిస్తే సులభంగా విద్య అందుతుందన్నారు. అంతేకాకుండా మెరుగైన జ్ఞాపక శక్తి కూడా వస్తుందన్నారు. ఎంఈవోలు తులసీ, పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు పునాది వేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విశ్రాంతి జడ్జి ఎం.కృష్ణారెడ్డి ధ్యానం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్నెం శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ అనురాధ, డీఆర్‌పీ కిశోర్, కృష్ణప్రసాద్, ఆర్‌పీఎస్‌పీ ప్రసాద్, శారద పాల్గొన్నారు.

లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన



సంతనూతలపాడులో సబ్సిడీ రుణాల దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నాడు బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల సబ్సిడీ పథకాల రుణాల దరఖాస్తులను సంతనూతలపాడు ఎంపీడీవో డీ సురేష్ బాబు, బ్యాంకర్లు, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. మండలంలో ఈ పథకాలకు సంబంధించి 404 దరఖాస్తులు వచ్చాయి. మొదటి రోజున 200 దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తు దారుల సిబిల్, తదితర అంశాలు పరిగణలోకి తీసుకుని జిల్లా కార్యాలయానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు కెనరా బ్యాంక్ మేనేజర్ జే ఆనంద్ కుమార్, స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కే స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మంగళవారం ఉదయం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయానికి హాజరు కావాలని కమిషనర్ రామకృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తారని, ఆధార్, కుల, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్ సర్టిఫికేట్‌లు తీసుకొని హాజరు కావాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయులు కీలకం



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో కిరణ్ కుమార్

నాగులుప్పలపాడు: విద్యార్థుల ఉన్నతి కోసం పాఠశాల నిర్వహణ, అభివృద్ధి అంశాలలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈవో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు అందించారు. విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనం వంటి వాటిపై సమీక్ష నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



చిన్నారికి వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి అఫ్సర్

చీమకుర్తి రూరల్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అఫ్సర్ సూచించారు. మంగళవారం మండలంలోని మంచికలపాడు సచివాలయ పరిధిలోని చీమలమర్రి, రెడ్డినగర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 30 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ఉచితంగా మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. మంచు పడుతున్న నేపథ్యంలో చంటి పిల్లలకు స్వెటర్లు వాడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులపై హర్షం



రోడ్డు మరమ్మతులను పర్యవేక్షిస్తున్న ఎస్సై అజయ్ కుమార్

సంతనూతలపాడు: జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో ఆర్ అండ్ బీ రహదారిలో గల స్పీడ్ బ్రేకర్ల వద్ద మరమ్మతుల కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఇటీవల సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్పీ దెబ్బతిన్న రహదారులను పరిశీలించి ప్రమాదాల నివారణకు మరమ్మతులు చేయాలని ఎస్సై అజయ్ బాబును ఆదేశించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఎస్సై స్వచ్ఛందంగా ప్రమాదాల నివారణకు మరమ్మతులు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ లను పటిష్టపరిచారు. చెరువు కట్ట వద్ద, మైనంపాడు డొంక, వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంతం వద్ద మరమ్మతులు చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలని వినతి

ఒంగోలు టౌన్: కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని.. దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ప్రభుత్వ నర్సుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు వినతి ప్రతం అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సుల ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు నర్సింగ్ సిబ్బంది పనిచేయాల్సి ఉందని, ప్రస్తుతం అందుకు విరుద్ధంగా కేవలం ముగ్గురు నర్సులు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీ వెంటనే 4వ స్టాఫ్ నర్సును నియమించాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోపిదేవి ఉదయలక్ష్మి, కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన రిజిస్ట్రార్

- ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణపై సంతృప్తి



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: కందుకూరు పట్టణంలోని వివేకా డిగ్రీ కళాశాల నందు జరుగుతున్న ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాన్ని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించి యూనివర్సిటీకి మంచిపేరు తీసుకొని రావాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు పరీక్షలను రాస్తున్న విధానాన్ని రిజిస్ట్రార్ నిశితంగా పరిశీలించారు. అనంతరం పరీక్ష నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా, సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తూ ఉండటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కందుకూరులోని వివేకా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మూడో సెమిస్టర్ పరీక్షలను సింగరాయకొండ లోని అభినవ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు తెలిపారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
TATA LPT 1616 45 HD BS 6
2023 MODEL AP39 VB 0537
Engine No: 3.3LNGD11DWX511322
Chassis No: MAT563041P7D08917
Cell: 73373 51808
D.No: 37-1-4(1), 2nd Floor, Vara Prasad Complex, Trunk Road, ONGOLE.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com